క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లేశం

పూడూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ మల్లేశం అన్నారు. బుధవారం పుడుగుర్తి గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పంచాయతీలో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందిచడంతో పాటు ప్రతి పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లిద్దాం..



ఇంటి పన్ను చెల్లిస్తున్న శేరిరాంరెడ్డి

కుల్కచర్ల: సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడదామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. బుధవారం పన్నుల వసూలు కార్యక్రమంలో పాల్గొని, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి ఇంటి పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నులు చెల్లించడం వలన గ్రామపంచాయతీకి అదనంగా ఆదాయం చేకూరుతుందని, తద్వార గ్రామాల్లో మరిన్ని అబివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పన్ను చెల్లించి, గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సొమ్యారెడ్డి, స్థానికులు మహేశ్వరం రాములు పాల్గొన్నారు.

పార్కులో ఊయల ఏర్పాటు



ఊయల ఏర్పాటు చేస్తున్న కాలనీవాసులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లి యంఐజీలో గల పార్కులో కాలనీకి చెందిన పలువురి దాతల సహాయంతో చిన్నారుల కోసం పలురకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఊయలను తీసుకువచ్చి, వారే అమర్చారు. గతంలో ఇదే పార్కులో జారుడు బండ, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, చిన్నారుల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయడాన్ని కాలనీవాసులు అభినందించారు. పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పంటకు కాపలాగా 'హెల్మెట్' దిష్టిబొమ్మ



పంట మధ్యలో దిష్టిబొమ్మ

యాలాల: అడవి పందులు, ఇతర జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతుంటారు. కొన్ని చోట్ల పంటలకు రక్షణగా సోలార్ తీగలు, పాత చీరలను ఏర్పాటు చేస్తే.. మరి కొందరూ దిష్టిబొమ్మలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే మండల పరిధిలోని సంగాయగుట్టతండాకు చెందిన రెడ్యా నాయక్ అనే యువరైతు కీరా పంటకు రక్షణగా హెల్మెట్ ధరించిన దిష్టిబొమ్మను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారికి పక్కనే పంట పొలం ఉండటం, పంట మధ్యలో హెల్మెట్ పెట్టిన దిష్టిబొమ్మ ఉండడంతో వాహనదారులు ఆసక్తిగా చూస్తున్నారు.

బీజేపీలో చేరిక



ఈటల సమక్షంలో పార్టీలో చేరిన పాలెపల్లి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మెట్లకుంటకు చెందిన విద్యావంతుడు, ప్రవాస భారతీయుడు పాలెపల్లి ఆలమయ్య నాయుడు బీజేపీలో చేరారు. మంగళవారం ఆపార్టీ నేత ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



పరిగి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల సతీమణి ప్రతిమారెడ్డి

మగువా.. మీకు వందనం

- అతివలు వంటింటికే పరిమితం కావొద్దు
- పురుషులతో సమానంగా రాణించాలి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు

మహిళలను ఆకాశంలో సగం, అవనిలో సగం అంటారు. అటువంటి మహిళా లోకం శక్తికి ప్రతీకగా నిర్వహించే సంబురం, అతివలంతా విశ్వవేడుకగా జరుపుకొనే వేడుక, మహిళా సాధికారత దిశగా నడిపించటం కోసం నిర్వహించే పండుగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఏటేటా ఆమెకు జేజేలు పలుకుతూ నిర్వహించే ఉత్సవం బుధవారం జిల్లాలో ఘనంగా జరిగింది. వారి సేవలను కొనియాడుతూ మహిళా మూర్తులను సత్కరించారు.



పెద్దేముల్: పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థునులు



కుల్కచర్ల: జీపీ కార్యాలయంలో..

బొంరాస్‌పేట: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం తుంకిమెట్లలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తోలు వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్నం పాల్గొని మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ, ఆశలు, మహిళా సంఘాల లీడర్లను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమిబాయి, సర్పంచు స్వరూప, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అండగా..

పరిగి: మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతుందని, వారికి అన్ని విధాలుగా తాము అండగా ఉంటామని ఆమె చెప్పారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పెద్దేముల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కేక్‌కట్ చేసి మాట్లాడారు. మహిళలు సమాజసేవలో ముందుండాలని చెప్పారు.

జీపీ కార్యాలయంలో..

కుల్కచర్ల: మండల పరిధిలోని గ్రామాల్లో మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. కుల్కచర్ల జీపీ ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దిర్సంపల్లిలో..

దోమ: దిర్సంపల్లిలో మహిళా దినోవత్సవాన్ని ప్రజాప్రతినిధులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు, అంగన్వాడీ ఆయాలు, శానిటేషన్ సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షులను ఆమె సన్మానించారు. ఉపసర్పంచ్ శిరీష, ఎంపీటీసీ బంగ్ల అనితగౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఉంటే..

దౌల్తాబాద్: మహిళలు అన్ని రంగాల్లో భాగస్వాములుగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పోటీ పడాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలను సన్మానించారు. జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ శిరీష, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

సత్కరించడం నా అదృష్టం..

కొడంగల్: మహిళా దినోత్సవం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన 80 మందికి పైగా మహిళలను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సన్మానించి మాట్లాడారు. మహిళామణులకు సముచిత స్థానం కల్పించి, సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

వంటింటికే పరిమితం కారాదు..

తాండూరు టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సింధు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కారాదని, అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. చదువుకునే రోజుల నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు లతాగౌడ్, అశ్విని, వసంత పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

కొడంగల్ రూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి చేతులమీదుగా ఉత్తమ అంగన్‌వాడీ హెల్పర్‌గా పట్టణానికి చెందిన కె.వసంత ప్రశంసా పత్రం అందుకున్నారు. పట్టణంలోని 10వ అంగన్‌వాడీ సెంటర్‌కు చెందిన వసంత.. ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్‌లో.. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప



తాండూరు టౌన్: వైద్యురాలు శెట్టి వైశాలి, ఆర్టీసీ డీఎం సమతను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ



కొడంగల్ రూరల్: కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న వసంత

శివాజీ ఆశయ సాధనకు కృషి

దోమ: ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం బొంపల్లి గ్రామానికి చెందిన యువకులకు మోత్కూర్ గ్రామంలోని ఆయన నివాసంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ.50 వేల విరాళం అందజేసి మాట్లాడారు. హిందూ ధర్మపరిరక్షణకు ఛత్రపతి చేసిన పోరాటం మరువలేనివన్నారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు ముద్దం నర్సింహా, భాస్కర్, రమేశ్, రాములు, రాజేశ్ యాదవ్, యాదయ్య, శ్రీనివాస్, చంద్రకంటి శ్రీనివాస్, మడుగు ప్రవీణ్, దోర్నాల్‌పల్లి యాదయ్య, చాకలి యాదయ్య, బండకింది యాదగిరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: కార్యకర్తలు, నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి, చిన్నమేగ్యానాయక్ తండాల్లో ట్రై సైకిల్ కోసం ఇబ్బంది పడుతున్న జంగయ్యను పరామర్శించారు. అనంతరం మేగ్యానాయక్ తండాకు చెందిన మాణిక్యం మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ఎలాంటి పరిస్థితి వచ్చినా తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శేఖర్, వెంకటయ్య, శేఖరయ్య, పెద్దబాబు, కృష్ణయ్య, వెంకట్రాములు, రాములు, నర్సింహులు, బాలరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు సయ్యద్ అంజద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలోని చెరువు కట్టపై దారికడ్డంగా ఉన్న కంపచెట్లు, వ్యవసాయదారుల ఎడ్ల బండ్లు వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా పోస్తున్న మొరం మట్టి పనులను సర్పంచ్ పరిశీలించారు. వంద రోజుల పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందమ్మ, బుగ్గప్ప, ఉప సర్పంచ్ మొగులయ్య, టీఏ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగారెడ్డి

అనంతగిరి: మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 8 సంవత్సరాల కాలంలో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి, ఆ రంగాన్ని కుదేలు చేసే కుట్ర చేసిందని విమర్శించారు. దేశంలో ఉన్న కార్మిక, కర్షకులందరికీ ఉచితంగా విద్యా, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేని పక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ అధ్యక్షుడు మైపాల్, నాయకులు రామకృష్ణ, బుగ్గప్ప, సుదర్శన్, మల్లేశం, చంద్రయ్య, శ్రీనివాస్, నర్సమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

ఇంటింటికీ తెలుగుదేశం

బొంరాస్‌పేట: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఇంటింటికీ టీడీపీ ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఆపార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సామల వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించారు. బొంరాస్‌పేట మండల కేంద్రంతో పాటు నాందార్‌పూర్, తుంకిమెట్ల, బురాన్‌పూర్, దుద్యాల మండలంలోని అల్లిఖాన్‌పల్లి, లగచర్ల, వాల్యానాయక్‌తండా, ఈర్లపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రచారంలో పార్టీ చేసిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ కండువాలతో నాయకులను సన్మానించారు.



ప్రచారం చేస్తున్న వెంకటప్రసాద్

12న గంధం ఉత్సవాలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

కొడంగల్ రూరల్: షేక్ హసన్ బిన్ మసూద్ గాజీ అన్సార్ ఖాద్రి గంధం ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఉప సర్పంచు ఎస్ఎం.గౌసన్ కోరారు. బుధవారం పట్టణంలోని మక్కా మసీద్‌లో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన పట్టణంలోని మహబూబ్ సుభానీ దర్గా నుంచి షేక్ సాబ్ దర్గా వరకు నిర్వహించే గంధం ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ఇందులో హాఫీజ్, అబ్దుల్‌కరీం, అశ్రఫీ, అబ్దుల్ జబ్బార్, ఎంఏ. సలీం, షేక్‌ఖాలీద్, అబ్దుల్‌ఖాదర్, ఎండీ. ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

13న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తాండూరు: పట్టణంలోని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 13న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు బీవీజీ ఫౌండేషన్ చైర్మన్, బాలాజీ హాస్పిటల్ యజమాని డాక్టర్ బి.సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులోని గంజ్ అసోసియేషన్ భవనంలో నిర్వాహకుడు కల్వ సుధాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన అనురాధ జయంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఘనంగా హోలీ సంబురాలు

షాబాద్: షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో బుధవారం యువత, స్థానిక నాయకులు ఘనంగా హోలీ పండుగను జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరు రంగులు జల్లుకొని సంబరాల్లో మునిగితేలారు. డీజే పాటలతో డాన్స్ చేశారు. ఉదయం నుంచే పిల్లలు వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిపై రంగులు చల్లుతూ ఉత్సాహంగా పండగను జరుపుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ, రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒక్కరు రంగులు చల్లుకున్నారు.

ఎమ్మెల్యే కృషితో గ్రామాల అభివృద్ధి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కృషితో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో ఎల్లమ్మ దేవాలయం నుంచి శ్మశానవాటిక వరకు సీసీరోడ్డు పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాండూరు మండలంలోని 23 గ్రామాలకు ఎంపీ నిధులు రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రతి ఊరికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, రాంలింగారెడ్డి, ప్రవీణ్ కుమార్, భీంరెడ్డి, ప్రశాంత్ గౌడ్, బాలరాజ్‌గౌడ్, నరేష్, అశోక్, ఎల్లప్ప, రాజు, రాజుగౌడ్ ఉన్నారు.

కేవీఎస్‌ను గెలిపించాలి

పూడూరు: బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేవీఎస్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ అన్నారు. బుధవారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేస్తా..

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 10,12,15వ వార్డుల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి సమస్య ఎక్కడ తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని, పారిశుద్ధ్య పనుల్లో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. మురుగు కాలువల్లో వ్యర్థ జలాలు నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్‌నాయక్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దోమ: మైలారం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి వారికి ఆలయ అర్చకులు నిత్యహవనం, విశేష అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణము, సాయంకాలార్చన ఊంజల్ సేవలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్మాణ కర్త రాములు ప్రత్యేక పూజలు చేశారు.



స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మొక్కలు వాడిపోతున్నాయ్

- వేసవి ప్రారంభంలోనే ఎండుతున్న వైనం
- వన నర్సరీలను పట్టించుకోని అధికారులు
- ఎండినా, పాడైనా కార్యదర్శులదే బాధ్యత: ఎంపీడీఓ



కందనెల్లితండా వన నర్సరీలో వాడిపోతున్న మొక్కలు

పెద్దేముల్: పర్యావరణ లక్ష్యమే ధ్యేయంగా.. మొక్కలు పెంచి అడవులను విస్తరించాలని, తద్వారా కరవు కాటకాలను పారద్రోలి, ఆకుపచ్చ తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో వన నర్సరీలను ఏర్పాటు చేసింది. వాటి సంరక్షణకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తూనే ఉంది. అధికారులకు దిశానిర్దేశం చేస్తూనే ఉంది. అయినా వాటిని చూసేవారు లేక.. వేసవి ప్రారంభ దశలోనే మొక్కలు ఎండిపోతున్నాయి.

పశువులకు మేతగా..

పెద్దేముల్ మండలంలో ప్రభుత్వం 37 వన నర్సరీలను ఏర్పాటు చేసింది. ఒక్కోదాంట్లో సుమారు 5వేల మొక్కలకు తగ్గకుండా ఉన్నాయి. కందనెల్లితండా, ఆత్కూర్, సిద్దన్నమడుగుతో పాటు పలు గ్రామాలల్లో మొక్కలు ఎండుముఖం పట్టాయి. దానికి తోడు రోడ్ల పక్కన నాటిన మొక్కలు ఎండి పోగా.. ఉన్న కొద్దిపాటి మొక్కలు మేకలు, పశువులకు మేతగా మారాయి. అంతేగాకుండా నర్సరీల్లో నెల రోజుల క్రితం విత్తనాలు నాటినా.. నేటి వరకు మొలకలు రాలేదు. దీంతో మరోసారి విత్తనాలను పంచాయతీ కార్యదర్శులు నాటించారు. మండల అధికారులు వాటి పరిరక్షణ, పరిశీలన ఖర్చులకు నిమిత్తం నిధులు తీసుకోవడమే తప్ప.. వాటి సంరక్షణ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రత్యక్ష పర్యవేక్షణ లేక..

గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వన నర్సరీలను సంబంధిత అధికారులు విస్మరిస్తున్నారని, కార్యాలయంలో కూర్చొని లెక్కలు చేయటమే తప్ప.. ప్రత్యక్షంగా చూడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏ నర్సరీలో ఎన్ని మొక్కలు..., ఏఏ మొక్కలు పెట్టారు? అనే విషయాన్ని మండల అధికారులను అడిగినా.. వారి నుంచి సరైన సమాధానాలు రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. వన నర్సరీల్లో ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణ సక్రమంగా ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేసవి ప్రారంభంలోనే మొక్కల పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మండుటెండల్లో ఎలా ఉంటుందోనని వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా మొక్కలు ఎండినా, పాడైనా పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతని, మొక్కలు పాడైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.